## క్లుప్తంగా

### ఎస్‌బీ డీఎస్పీగా సత్యనారాయణ



కాకినాడ క్రైం: స్థానిక పోలీస్ స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బి) డీఎస్పీగా కూనపురెడ్డి వెంకట సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు, శుక్రవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో పిఠాపురం, రాజమహేంద్రవరం, అడ్డతీగల సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఆయన అనపర్తి, జగ్గంపేట, కైకలూరు, నూజివీడు స్టేషన్‌ల ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. పదోన్నతి పొంది కాకినాడ ట్రాఫిక్ డీఎస్పీగా, ఏలూరు మహిళా పోలీస్ డీఎస్పీగా, పరవాడ ఎస్‌డీపీవోగా పనిచేశారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా పనిచేస్తూ తాజా బదిలీలో అక్కడి నుంచి బదిలీపై కాకినాడ స్పెషల్ బ్రాంచ్‌లో నియమితులయ్యారు.

### ఆలోచింపజేసిన నాటికలు



అమ్మ చెక్కిన బొమ్మ నాటికలో సన్నివేశాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

బోట్‌క్లబ్: అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ రజతోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న నాటిక పోటీలు నగర వాసులను అలరించాయి. శనివారం పడాల వీరభద్రరావు స్మారక కళాప్రాంగణంలో స్వరాభిషేకం పేరిట జరిగిన సినీ సంగీత విభావరి ఆహూతులను అలరింపజేసింది. అనంతరం ఆంధ్రశ్రీ పురస్కార ప్రదానోత్సవంలో భాగంగా అన్నంరాజు సీతాపతిరావుకు పురస్కారాన్ని అందజేశారు. నాటికల ప్రదర్శనలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన గోవాడ క్రియేషన్స్ బృందం 'అమ్మ చెక్కిన బొమ్మ' నాటిక ప్రదర్శించింది. తల్లి ప్రాముఖ్యాన్ని వివరిస్తూ, భగవంతుడైనా అమ్మ తరువాతేనని తెలియజేస్తూ ప్రదర్శించిన సన్నివేశాలు మనసులను హత్తుకున్నాయి. అనంతరం విశాఖకు చెందిన భద్రం ఫౌండేషన్ బృందం ప్రదర్శించిన 'దొందూ దొందే' నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. కార్యక్రమంలో భాగంగా బి.వెంకన్నబాబుచే అశ్వత్థామ ఏకపాత్రాభినయం ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కె.అచ్యుతరామారెడ్డి, ప్రధాన కార్యదర్శి పంపన దయానందబాబు, సభ్యులు, కళాకారులు, కళాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీల నియామకం

కరప: మండల పరిధిలోని మూడు పీఏసీఎస్ కార్యాలయాలకు త్రిసభ్య కమిటీల నియామకం జరిగింది. కూరాడ పీఏసీఎస్‌కు చైర్మన్‌గా వెలుగుబంట్ల సూరిబాబు (కూరాడ), సభ్యులుగా నున్న నాగేశ్వరరావు(సిరిపురం), పి.నూకరాజు (వేళంగి) నియమితులయ్యారు. వేములవాడ పీఏసీఎస్ చైర్మన్‌గా దూడల నారాయుడు (వాకాడ), సభ్యులుగా నక్కా సత్యనారాయణ, ఉలుసు వీర్రాజు (వేములవాడ) నియమితులయ్యారు. కరప పీఏసీఎస్ చైర్మన్‌గా సైనబారపు భవానీశంకర్ (కరప శివారు రామకంచిరాజునగర్‌కాలనీ), సభ్యులుగా చోడిశెట్టి సత్యనారాయణ (పాతర్లగడ్డ), అడపా శ్రీనివాస్ (కరప) నియమితులయ్యారు. ఎమ్మెల్యే పంతం నానాజీ సమక్షంలో త్రిసభ్య కమిటీ సభ్యులను ఆయా పీఏసీఎస్ కార్యాలయాల సీఈఓలు పి.పరశురాముడు, రాయుడు వెంకటేశ్వరరావు, ఎస్.చంద్రశేఖరరావు రిజిస్టర్‌లలో సంతకాలు చేయించారు.

### ఆంజనేయరెడ్డికి 'ఆంధ్రశ్రీ' ప్రదానం



ఆంధ్రశ్రీ బిరుదును అందుకుంటున్న ఆంజనేయరెడ్డి

కాకినాడ రూరల్: కాకినాడకు చెందిన సామాజిక కార్యకర్త అనపాల ఆంజనేయరెడ్డి ఆంధ్ర శ్రీ బిరుదును అందుకున్నారు. ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో విజయవాడలో అమరావతి కీర్తి పురస్కారాలలో భాగంగా పాన్ ఇండియా సోషియో కల్చర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు అద్దంకి రాజా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆంజనేయ రెడ్డి మాజీ మంత్రి కొత్తపల్లి శామ్యూల్ జవహర్ చేతుల మీదుగా శనివారం పురస్కారం అందుకున్నారు. సామాజిక సేవకు గాను తనకు జ్ఞాపిక, కంకణ, కిరీట ధారణతో ప్రశంసా పత్రం అందించారని ఆంజనేయరెడ్డి తెలిపారు.

### వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

సామర్లకోట: మండల పరిధిలోని గొంచాల గ్రామంలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరుని ఆలయంలో శనివారం స్వామి వారి శ్రవణం నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు.

# అన్నదాతకు సహకారమేదీ?

- ముక్కుపిండి మరీ వడ్డీ రాయితీ వసూలు
- కేంద్రం నిధులిస్తున్నా పైసా విదల్చని కూటమి ప్రభుత్వం
- నిరుపయోగంగా సొసైటీలు



కరప ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం

కరప: రైతులకు వడ్డీ రాయితీ అందే పరిస్థితి కనిపించడం లేదు. రైతు పక్షపాతిగా చెప్పుకొంటున్న ప్రభుత్వం ఆచరణలో ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. సహకార సంఘాలు, బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు అందించి, రైతులను అన్ని విధాలా ఆదుకుంటామన్న పాలకుల మాటలు చేతల్లో కనపడడం లేదు. 7 శాతం వడ్డీ ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారని, అయినా పట్టించుకోని పాలకుల పనితీరుపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు సొసైటీలలో 12 శాతం (రూపాయి) వడ్డీకి పంట రుణాలు ఇచ్చేవారు. దానిని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పావలా వడ్డీకే పంటరుణాలు అందించి, రైతులకు వెన్నుదన్నుగా ఉండేవారని రైతులు ఆనాటి రోజులను గుర్తు చేసుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వడ్డీ రాయితీ ఇవ్వకపోవడంతో సొసైటీలు, బ్యాంకులు రైతుల నుంచి 7 శాతం వడ్డీ వసూలు చేస్తున్నాయని రైతులు అంటున్నారు. ఇందులో 3 శాతం కేంద్రం, 4 శాతం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఆ నిధులు ఇవ్వకపోవడంతో రైతులు తీసుకున్న పంట రుణాలకు సొసైటీలు, బ్యాంకులు 7 శాతం వడ్డీ వసూలు చేస్తూ, ప్రభుత్వాలు చెల్లిస్తే రైతుల ఖాతాలకు జమచేస్తామంటున్నారు. సహకార సంఘాలు రైతులకు అందిస్తున్న సహకారం నేతిబీరకాయలో నేతి చందాన తయారైందంటున్నారు. రైతుల నుంచి వడ్డీ లేకుండా వసూలు చేసి, ప్రభుత్వం నుంచి వడ్డీరాయితీ వచ్చినప్పుడు సొసైటీలు తీసుకోవాలి. అయితే చాలా సొసైటీలు వడ్డీభారం తమమీద పడకుండా ప్రభుత్వం ఇచ్చాక, వడ్డీ రాయితీ తిరిగి చెల్లిస్తామంటూ 7 శాతం వడ్డీ వసూలు చేస్తున్నారు. దీంతో రైతులకు భారంగా మారింది. కేంద్ర ప్రభుత్వం తన వాటాగా మూడు శాతం వడ్డీ రాయితీ చెల్లిస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం తనవాటా 4 శాతం ఇవ్వకపోవడంతో వడ్డీలేని రుణాలు దక్కడంలేదని రైతులు అంటున్నారు. కరప సొసైటీని తీసుకుంటే సుమారు 1,400 మంది రైతులు సభ్యులుగా ఉండగా పంటరుణాలు సుమారుగా రూ 3.5 కోట్లు తీసుకున్నారు. గత ఏడాది వడ్డీ రాయితీ రూ 24.5 లక్షలు రావాల్సి ఉంది. మండల పరిధిలో కరప, వేములవాడ, కూరాడ, యండమూరు, పెద్దాపురప్పాడు, పెనుగుదురు, జెడ్.భావారం పీఏసీఎస్ (సొసైటీ)లు ఉన్నాయి. ఒక్కొక్క సంఘంలో 1100 నుంచి 2200 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. సుమారుగా రూ.30 కోట్ల వరకు పంటరుణాలు ఇస్తున్నారు. రైతులకు అందాల్సిన వడ్డీ రాయితీ ఒక్క ఏడాదికి రూ. 2.1 కోట్లు ఉంటుందని సొసైటీల సీఈఓలు అంటున్నారు. కొన్ని సొసైటీలకు రెండు ఏళ్ల నుంచి వడ్డీ రాయితీ బకాయి ఉన్నట్టు చెపుతున్నారు. ప్రభుత్వం స్పందించి వడ్డీ రాయితీ చెల్లించాలని మండలంలోని రైతులు కోరుకుంటున్నారు.

### పేరుకే వడ్డీ లేని రుణాలు



వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని ప్రకటించడమే కానీ సొసైటీలు 7 శాతం వడ్డీ వసూలు చేస్తున్నాయి. అడుగుతుంటే ప్రభుత్వం నుంచి వడ్డీ రాయితీ వచ్చాక తిరిగి చెల్లిస్తాం అంటున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే వరకు ఆ వడ్డీ భారం సొసైటీలు భరించి, రైతులకు మేలు జరిగేలా చూడాలి.

– బందే పట్టాభిరామయ్య, రైతు, మాజీ సర్పంచ్, వేములవాడ

### వడ్డీ రాయితీ రాక ఇబ్బందులు



వడ్డీ లేని రుణాలు ఇవ్వకపోవగా ఉచిత పంటల బీమా ఎత్తేసి రాష్ట్ర ప్రభుత్వం రైతుల నడ్డి విరుస్తోంది. అన్నదాతను ఆదుకునేందుకు సకాలంలో వడ్డీ రాయితీ చెల్లించాలి.

– కాదా వెంకటేశ్వరరావు, రైతు, విజయరాయుడుపాలెం

### ఆహార నియమాలతో ఆరోగ్య జీవనం



వైద్యుడు దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న రోటరీ గోల్డెన్ జూబ్లీక్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: ప్రతి ఒక్కరూ ఆహార నియమాలు పాటిస్తే ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చని డైట్ హాస్పిటల్ అధినేత భీమాల దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక రోటరీ హాల్‌లో శనివారం రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జంక్ ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్ వంటి పదార్థాలు తినడం వల్ల రక్తంలో చక్కర స్థాయి పెరిగే ప్రమాదం ఉందన్నారు. వేయించిన ఆహారాలు, కొవ్వు, మాంసం వంటి వాటి ద్వారా రక్తంలో చక్కర అనుకున్న స్థాయి కన్నా ఎక్కువగా వస్తుందన్నారు. పప్పుధాన్యాలు, గుడ్లు, చేపలు తీసుకోవాలన్నారు. వైద్యుల సహాయం లేకుండా సొంత వైద్యం చేసుకుంటే అటువంటి వారికి భవిష్యత్‌లో అనేక సమస్యలు ఎదుర్కొనాల్సి వస్తుందన్నారు. అనంతరం క్లబ్ సభ్యులు వైద్యులు బీమాల దుర్గాప్రసాద్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు గోపీనాథ్, కార్యదర్శి సానా ప్రవీణ్, సభ్యులు చెలికాని సూర్యారావు, జీకె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు స్టేషన్లలో ప్లాస్టిక్ నిషేధం



సూర్యారావుపేట బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న ఎస్పీ బిందు మాధవ్ తదితరులు



పోలీసు అధికారులు, సిబ్బందితో ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ

- ఎస్పీ బిందుమాధవ్
- సూర్యారావుపేట బీచ్‌లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

కాకినాడ రూరల్: పర్యావరణ హితాన్ని కోరుకుంటూ జిల్లాలో అన్ని పోలీసు స్టేషన్లలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని ఎస్పీ బిందుమాధవ్ పిలుపు ఇచ్చారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగంగా సూర్యారావుపేట బీచ్‌లో ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం ఉదయం ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ తొలుత పోలీసు అధికారులు, సిబ్బందితో ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేయించారు. సిబ్బందితో కలిసి తీరంలో ఉన్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌కు బదులుగా ప్రత్యామ్నాయాలను వినియోగించుకోవాలన్నారు. గాజు సీసాలు, కాగితపు ప్యాకింగ్, గుడ్డ సంచులు వంటివి వినియోగించడం వల్ల పర్యావరణానికి దెబ్బ అన్నారు. జిల్లా వ్యాప్తంగా సబ్ డివిజన్ల పరిధిలోని అన్ని సర్కిళ్లు, పోలీసు స్టేషన్లలో అధికారులు, సిబ్బంది తమ కార్యాలయ పరిసరాలలో ప్లాస్టిక్ రహిత వాతావరణం సృష్టించి, పర్యావరణాన్ని రక్షించే దిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ ఏఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, ఎస్‌డీపీఓ పాటిల్ దేవరాజ్ మనీష్, ఏఆర్ డీఎస్పీ శ్రీహరిబాబు, రూరల్ సీఐ చైతన్య కృష్ణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నరసింహమూర్తి, తిమ్మాపురం ఎస్సై గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

#### కరపలో..

కరప: డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ నియంత్రణపై సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు.

#### పారిశ్రామిక ప్రాంతంలో..

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్యపేట ఇండస్ట్రియల్ ఏరియాలో స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ నిర్వహించారు. ఏపీఐఐసీ, డీఐసీ ఆధ్వర్యంలో సత్యదేవ ప్రింటింగ్ క్లస్టరు ప్రాంతంలో పరిసరాలు శుభ్రం చేసి, మొక్కలు నాటారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజరు రమణారెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్‌మేనేజరు గణపతి, సత్యదేవ ప్రింటింగ్ క్లస్టరు మేనేజరు డైరెక్టరు కోరుమిల్లి బాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

#### కలెక్టరేట్‌లో..



కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా అధికారులు, వికాస, కలెక్టరేట్ సిబ్బంది

కాకినాడ సిటీ: ప్రతి నెల మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, కార్యాలయ ఆవరణలో ఉన్న వికాస, పౌరసరఫరాలు, డ్వామా, ప్రణాళిక శాఖల అధికారులు, కలెక్టరేట్ వివిధ విభాగాల అధిపతులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఇతర సిబ్బంది అక్కడి ఆవరణను శుభ్రం చేసి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామంటూ మానవహారం నిర్వహించారు. అనంతరం డీఆర్వో వారితో ప్రతిజ్ఞ చేయించారు. డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, సీపీవో పి.త్రినాథ్, వికాస పీడీ కె.లచ్చారావు, కలెక్టరేట్ ఏవో ఎస్ రామమోహన్, వివిధ విభాగాల అధిపతులు, పౌరసరఫరాలశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# చెత్తను సత్వరం తొలగించండి



పేట కాల్వ రోడ్డులో డ్రైనేజీ వద్ద చెత్తను పరిశీలిస్తున్న సర్పంచ్ సత్యనారాయణ, అవంతినగర్ వాసులు

కాకినాడ రూరల్: తిమ్మాపురం పరిధిలోని పేట కాల్వ డ్రైనేజీలో కార్పొరేషన్ సిబ్బంది, రమణయ్యపేట పంచాయతీ సిబ్బంది వేస్తున్న చెత్తను తక్షణమే తొలగించాలని అవంతినగర్ కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. సర్పంచ్ బెజవాడ సత్యనారాయణతో కలిసి వారు పేట కాల్వను పరిశీలించారు. సర్పవరం రోడ్డులో పేట కాల్వ డ్రైనేజీ పక్కనే చెత్త వేయడంతో చాలా వరకు మూసుకుపోయినట్టు గుర్తించారు. వరద వస్తే నీరు పోయే అవుట్‌లెట్ సరిగా లేక ఇబ్బంది పడాల్సి వస్తోందని, ముంపులో ఉన్నామనే సానుభూతి కంటే తక్షణమే నీరు పోయేందుకు పూడిక తీత, చెత్త తొలగించాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ పేట కాల్వ ద్వారా నీరు సక్రమంగా పారకపోతే అవంతినగర్, మారుతీనగర్ మునిగిపోయే ప్రమాదం ఉందన్నారు. ఎమ్మెల్యే పంతం నానాజీ ఇటీవల పంట కాల్వల పూడిక తీత పనులు చేయిస్తున్నారని, వాటితో పాటు అవుట్‌లెట్లలో నీరు పోయే మార్గం ఏర్పాటు చేయాలన్నారు. డ్రైనేజీలో చెత్త వేసి డంప్ యార్డుగా మార్చడంతో కలెక్టరుకు గ్రీవెన్స్ సెల్‌లో సోమవారం ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో అవంతినగర్ కాలనీ అసోసియేషన్‌కు చెందిన గుండా శ్రీనివాసు, గండి శ్రీను, యాళ్ల అబ్బులు, మిర్తిపాటి శ్రీనివాస్, డీఎస్ఎన్ రాజు, బిందాని సురేష్, పాలపర్తి రాజు, విజయ్ కుమార్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి వైపు అడుగు వేద్దాం




కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కాకినాడ సిటీ: స్థానిక మహర్షి సాంబమూర్తి వికలాంగ బాలికల ఆశ్రమ పాఠశాలలో అమెరికాకు చెందిన శ్రితా పల్లా శనివారం మధుబని ఆర్ట్ వర్క్‌షాప్ ప్రారంభించారు. ఆ దేశంలోని వాషింగ్‌టన్‌కు చెందిన 16 ఏళ్ల విద్యార్థిని, టుగెదర్ ఉయ్ షైనీ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలైన ఆమె ఇక్కడి పిలలను ఉద్దేశించి మాట్లాడుతూ ఎవరో రావాలి, ఏదో చేయాలని కాకుండా మనం ఎవరికీ తక్కువ కాదని నిరూపించుకునేందుకు ప్రగతి వైపు నడవడానికి నిర్ణయించుకుంటే మనమే సమాజం కోసం ప్రకాశించవచ్చని పేర్కొన్నారు. వికలాంగులకు సురక్షితమైన, సృజనాత్మక వాతావరణాన్ని అందించి, వారిలో అభివృద్ధిని ప్రోత్సహించటం, విద్యార్థులకు రంగుల ఊహల్లో పెయింటింగ్స్, డిజైన్ల రూపకల్పనలో పాల్గొనేలా చేస్తునట్టు తెలిపారు. వర్క్‌షాప్‌లో వారు చేసిన ఒక నెమలి పెయింటింగ్, సాంప్రదాయ బోర్డర్ డిజైన్, ప్రతి విద్యార్థికి తమ సొంత పుస్తకాలు, రంగులు, పూర్తయిన పేస్టింగ్, చిరునవ్వుతో నిండిన హృదయం తమను తాము దాచుకోవాల్సిన అవసరం లేని ప్రపంచాన్ని నిర్మించాలనే లక్ష్యంతోనే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు శ్రితా వివరించారు. ఈ కార్యక్రమంలో విజయ్ పల్లా, కవిత, సుమేష్, సుమేధ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీల ఆర్థిక బలోపేతమే లక్ష్యం

- రీజినల్ డైరెక్టర్ నాగనరసింహారావు
- అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష



మున్సిపల్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న రీజినల్ డైరెక్టర్ నాగనరసింహారావు

సామర్లకోట: రీజియన్ పరిధిలోని మున్సిపాలిటీలు ఆర్థికంగా బలోపేతం చేయడానికి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నట్టు రీజినల్ డైరెక్టర్ నాగనరసింహారావు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జిల్లాలోని మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. కమిషనర్ ఎ.శ్రీవిద్య, చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ఆర్డీకి స్వాగతం పలికారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ రీజియన్ పరిధిలో ఏడు జిల్లాల్లోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పట్టణ స్థానిక సంస్థలను బలోపేతం చేసేలా ప్రతి నెల ఒక చోట సమావేశం నిర్వహించి ఆయా అంశాలపై సమీక్షిస్తున్నట్టు తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో అనధికార కట్టడాలను గుర్తించి సంబంధిత వర్గాలకు నోటీసులు ఇవ్వడం, చార్జిషీట్ నమోదు చేయడం, వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. దీనివల్ల మున్సిపాలిటీల ఆదాయం పెరుగుతుందన్నారు. ప్రస్తుతం వీధి వ్యాపారుల సర్వే జరుగుతోందని, సామర్లకోట మున్సిపాటీలో సర్వే 67 శాతం ఉండగా మిగిలిన మున్సిపాలిటీల్లో 80 శాతం పూర్తి అయిందన్నారు. సర్వే అనంతరం మూడు జోన్లుగా ఏర్పాటు చేసి వారికి ఆయా జోన్లలో మాత్రమే విక్రయాలు చేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. ఇదే సమయంలో వారిని ఐదుగురు చొప్పున గ్రూపులుగా ఏర్పాటు చేసి రుణాలు ఇచ్చి వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తామని చెప్పారు. వారికి పోలీసుల సహకారంతో ప్రత్యేకంగా ఒక ప్రదేశం ఏర్పాటు చేయడం ద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉండటమే కాకుండా, శానిటేషన్ సమస్య ఉండదన్నారు. ట్రేడ్ లైసెన్సులపై మున్సిపల్ సిబ్బంది చూపాలని, ఏటా ఫీజు పెంచాలన్నారు. గతంలో సిబ్బంది కొరత ఉండేదని, అయితే ప్రస్తుత మున్సిపాలిటీ సచివాలయంలో ఉన్న సిబ్బందితో అనధికార కుళాయిలను సర్వే చేయించి కౌన్సిల్ సహకారంతో నియంత్రిస్తున్నట్టు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. వృద్ధులు, దివ్యాంగులు కార్యాలయానికి వచ్చే అవకాశం లేకపోవడంతో డయల్ యువర్ కమిషనర్ ఏర్పాటు చేయాలని కమిషనర్లకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మున్సిపల్ కమిషనర్లు ఎ.శ్రీవిద్య, వెంకట్రావు, శ్రీకాంత్‌రెడ్డి, సత్యనారాయణ, కనకారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# బీజేపీ జిల్లా నూతన కార్యవర్గం



బీజేపీ నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న జిల్లా అధ్యక్షులు విశ్వేశ్వరరావు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): బీజేపీ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ప్రకటించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన ఈ వివరాలు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులుగా గూటూరి పద్మ, ఏడిద కృష్ణ, రవణం సుబ్రహ్మణ్యం, పెండెం శ్రీదేవి, తేజోమూర్తుల ఉషారాణి, వెలుగుల గోపాలకృష్ణ, మొసలగంటి సురేష్, ప్రధాన కార్యదర్శులుగా చోడిశెట్టి రమేష్‌బాబు, డీవీఎస్ఎస్ఆర్‌కె వర్మ, కుండల సాయికుమార్, జిల్లా కార్యదర్శులుగా జ్యోతుల రాజేష్, కోన వెంకట సురేష్, బి.ధనలక్ష్మి, మేడ విజయలక్ష్మి, చిన్నయ్యదొర, గుడాల ప్రతాప్, రెడ్డి వీరవరలక్ష్మి, కోశాధికారిగా పైడా రవీంద్ర, సోషల్ మీడియా అధ్యక్షుడిగా గౌతు చిన్నారావు, ఐటీ విభాగం అధ్యక్షుడిగా ప్రకాష్‌ను నియమించారు. వీరితో పాటు మరో 27 మంది కార్యవర్గ సభ్యులను నియమించారు. నూతన సభ్యులు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పైడా కృష్ణమోహన్, మాలకొండయ్య పాల్గొన్నారు.

# వైద్య ఉద్యోగుల హక్కులు కాపాడాలి

- అన్యాయమైన ఉత్తర్వులను రద్దు చేయాలి
- సీహెచ్‌సీ వైద్యాధికారి చర్యలను నిలదీసిన ఏపీజీఈఏ నాయకులు



వైద్యాధికారితో చర్చిస్తున్న సంఘం నాయకులు

పిఠాపురం: స్థానిక వైద్య ఉద్యోగులపై అన్యాయంగా జారీ చేసిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) నాయకులు డిమాండ్ చేశారు. ఎనిమిది గంటల పనితో పాటు 'ఆన్-కాల్ డ్యూటీ' పేరుతో అదనపు పని చేయిస్తూ, ఆ విధులకు హాజరు కాకుంటే చర్యలు తీసుకుంటామని స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారి జారీ చేసిన ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమని సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య రంగంలోని ఉద్యోగులకు ప్రజాస్వామ్య హక్కులు లేవా అని వారు ప్రశ్నించారు. పారా మెడికల్ సిబ్బంది ఆన్ కాల్ డ్యూటీకి తప్పనిసరిగా హాజరుకావాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామంటు సీహెచ్‌సీ వైద్యాధికారి సుజాత ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. దీంతో తమపై అదనపు భారం మోపుతున్నారని ఉద్యోగులు సంఘం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో శనివారం తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్‌వర్మ నాయకత్వంలో సంఘం ప్రతినిధులు పిఠాపురం ఆస్పత్రికి చేరుకుని వైద్యాధికారితో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా గిరిప్రసాద్ వర్మ మాట్లాడుతూ, హాస్పిటల్ ఉద్యోగుల పట్ల మానవీయ కోణాన్ని పక్కన పెట్టి, వారిని నిర్బంధించి పనికి ఆదేశించడాన్ని తమ సంఘం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. ఉద్యోగులకు ఎక్కడ అన్యాయం జరిగినా పోరాడాలని తమ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ ఆదేశించారని, ఏ శాఖ ఉద్యోగులకు ఇబ్బంది వచ్చినా న్యాయం కోసం పోరాడతామని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులు పి.రవికుమార్ మాట్లాడుతూ వైద్య రంగంలో గతంలో 20 నుండి 30 ఓపీడీలు ఉన్న సమయంలో నిర్ణయించిన సిబ్బంది విధానంతోనే నేడు వందల్లో ఓపీడీలు పెరిగినా అదే సిబ్బందితో కొనసాగుతున్నారన్నారు. ఆన్-కాల్ డ్యూటీకి పారామెడికల్ సిబ్బందికి అలవెన్సులు ఇవ్వకుండా నిర్బంధ ఆదేశాలు ఎలా ఇస్తారని ఆయన వైద్యాధికారిని ప్రశ్నించారు. ఇటువంటి చర్యలు పునరావృతమైతే తమ సంఘం ప్రతిఘటిస్తుందని హెచ్చరించారు. భవిష్యత్తులో సమస్యలు రాకుండా చూడాలని, లేకపోతే చూస్తు ఊరుకునేది లేదని సంఘం నాయకులు హితవు పలికారు.

# బ్యాంకింగ్ సేవలపై అవగాహన



బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పిస్తున్న చీఫ్ మేనేజర్ నరసింహమూర్తి

బాలాజీచెరువు: బ్యాంకుల జాతీయీకరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక దేవాలయం వీధిలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు రైతులు, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకింగ్ సేవలపై శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. బ్యాంకు చీఫ్ మేనేజర్ నరసింహమూర్తి మాట్లాడుతూ బ్యాంకుల జాతీయీకరణ భారత ఆర్థిక వ్యవస్థలో ఒక మైలురాయన్నారు. 1969 జూలై 19న 14 ప్రైవేట్ బ్యాంకులను జాతీయీకరించడంతో గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు విస్తరించాయన్నారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా జూలై 31 తేదీ వరకూ రైతుకు అండగా నిలిచేందుకు రైతు మాసం కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. దీనిలో భాగంగా రైతు దినోత్సవాన్ని తమ బ్యాంకులో నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు రుణ సదుపాయాలు, వ్యవసాయ బీమా, డిజిటల్ లావాదేవీల గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాల ఆర్థిక క్రమశిక్షణ, రుణాల చెల్లింపులో వారు పాటిస్తున్న నిబద్ధత ప్రశంసనీయమన్నారు. గత పదేళ్లుగా మహిళా సంఘాలు రుణాలను సక్రమంగా చెల్లిస్తున్నాయని.. నేడు బ్యాంకులు వారికి రుణాలను ఇచ్చేందుకు పోటీ పడుతునాయన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన రుణ పథకాలను వివరిస్తూ మా బ్యాంక్ రైతులకు అన్ని విధాలుగా సహాయపడేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విద్యాసాగర్, ఇతర బ్యాంకు సిబ్బంది, రైతులు బీవీవీ సత్య కుమార్, యు.సాయి ప్రశాంత్, ఇతర రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.